

ఎంపీ ఈటలకు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి, కాలనీవాసులు

కాలనీల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

వనస్థలిపురం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కాలనీల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కోరారు. ఈ మేరకు దుర్గాసాయినగర్ కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ ఆదివారం ఎంపీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని కాలనీల అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీ హామీ ఇవ్వడం సంతోషకరం అన్నారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకవస్తే ప్రాధాన్యత క్రమంలో భాగంగా పరిష్కరిస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో దుర్గాసాయినగర్‌కాలనీ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి ముత్యాలు, కోశాధికారి యాదగిరిగౌడ్, శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



పద్మావతికాలనీ కమాన్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి, సీనియర్ నాయకుడు ఎస్‌వీ కృష్ణప్రసాద్

పద్మావతికాలనీ ముఖద్వారం ప్రారంభం

హయత్‌నగర్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్‌లోని ఆర్టీసీ బస్ డిపో పక్కన ఉన్న పద్మావతి కాలనీలో నూతనంగా నిర్మించిన కాలనీ ముఖద్వారాన్ని కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, ఆర్చీ నిర్మాణానికి ఆర్థిక సహాయం చేసిన దాత ఎస్‌వీ కృష్ణప్రసాద్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. అనంతరం కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సొంత నిధులతో నిర్మించుకున్న కమ్యూనిటీ హాల్‌ను కూడా కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసులు కలిసికట్టుగా ఉండి అభివృద్ధి చేసుకోవాలని కోరారు. సొంత డబ్బులతో కమ్యూనిటీ హాల్ ను నిర్మించుకున్నందుకు కాలనీ సంక్షేమ సంఘం నాయకులను అభినందించారు. కార్యక్రమంలో హయత్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్ రెడ్డి, సంక్షేమ సంఘం నాయకులు అంతటి అమర్‌నాథ్‌గౌడ్, సురకంటి జగన్‌మోహన్‌రెడ్డి, కొండా చంద్రశేఖర్, మందడి యాదగిరిరెడ్డితో పాటు బీఆర్ఎస్ నాయకులు శ్రీధర్‌గౌడ్, నగేష్, గోవిందచారి పాల్గొన్నారు.

ఆర్టీఏ సీజ్ చేసిన వాహనాల బహిరంగ వేలం



వాహనాల వేలం పాటకు హాజరైన పలువురు

హయత్‌నగర్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలతో ఆర్టీఏ అధికారులు సీజ్ చేసిన వాహనాలను ఆదివారం మన్నెగూడలోని ఆర్టీఏ కార్యాలయంలో బహిరంగ వేలం వేశారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు వేలం పాట నిర్వహించారు. పలువురు పెద్ద ఎత్తున పాల్గొని వేలం పాటలో పలు రకాల వాహనాలను దక్కించుకున్నారు. మొత్తం 178 వాహనాలను వేలం వేయగా రూ.55,06,500 వచ్చినట్లు ఇబ్రహీంపట్నం ఆర్టీఓ సుభాష్‌చంద్రారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీఏ అధికారులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మిరెడ్డి, పక్కన వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ గవర్నర్ లింగప్రకాష్, క్లబ్ అధ్యక్షుడు రామాచారి

వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

చాదర్‌ఘాట్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఉచిత వైద్య, ఆరోగ్య పరీక్షా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మూసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి అన్నారు. ఆదివారం శాలివాహన వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మూసారాంబాగ్‌లోని శాలివాహననగర్ కాలనీ పార్క్‌లో స్వస్థ ఆయుష్మాన్ చికిత్సాలయం సౌజన్యంతో నిర్వహించిన ఉచిత మెగా వైద్య పరీక్షా శిబిరాన్ని ఆమె వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ గవర్నర్ లింగ ప్రకాష్‌తో కలిసి ప్రారంభించారు. మందుల వాడకం లేకుండానే ఆయుర్వేదిక్, హోమియో, నాచ్యురోపతి, మాన్యువల్ ఫిజియోథెరపీ, అల్టర్నేటివ్ థెరపీ, న్యూట్రిషన్, డైట్‌పై డాక్టర్ గౌతమి అవగాహన కల్పించారు. క్లబ్ అధ్యక్షుడు పి.రామాచారి, కార్యదర్శి పి.కమలాకర్, కోశాధికారి యాదయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఇన్‌స్పెక్టర్ సూర్యనాయక్‌తో కలిసి మమతనగర్‌లో పార్కును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్

పార్కులను సద్వినియోగం చేసుకోవాలి

మన్సూరాబాద్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): వాకింగ్, వ్యాయామాలు చేసేందుకు ప్రతి ఒక్కరూ తమ సమీపంలోని క్రీడా ప్రాంగణాలను, పార్కులను సద్వినియోగం చేసుకోవాలని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్ సూచించారు. డివిజన్ పరిధిలోని మమతానగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పార్కును నాగోల్ ఇన్‌స్పెక్టర్ ఎ.సూర్యనాయక్‌తో కలిసి కార్పొరేటర్ అరుణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్‌కు వెళ్లే వారు రోడ్లపై కాకుండా పార్కులోని వాకింగ్ ట్రాక్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్ యాదవ్, బీజేపీ నాగోల్ డివిజన్ అధ్యక్షుడు పంగా శ్రీకాంత్, కాలనీవాసులు శ్రీధర్, ప్రభావతి, సురేఖ, శ్రీనివాస్, రామ్మోహన్, శ్రీలత, మహేష్‌శెట్టి, బసవరాజు, సత్యంగౌడ్, నాయకులు యశ్వంత్, శివకుమార్ పాల్గొన్నారు.



ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ తెలంగాణ నూతన కార్యవర్గ సభ్యులు ఆదివారం హైకోర్టు మాజీ జస్టిస్ చంద్రయ్యను కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ నేమ్‌సింగ్, సౌత్ చైర్మన్ సయ్యద్ ఖాసీమ్, రాజబోయిన కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. - సైదాబాద్, ఆంధ్రజ్యోతి

ప్రజానాయకుడు పండుగ సాయన్న

- ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే సబితారెడ్డి
- జిల్లెలగూడలో ఘనంగా విగ్రహావిష్కరణ

సరూర్‌నగర్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రజాకార్ల ఆకృత్యాలకు, అన్యాయాలకు ఎదురొడ్డి పోరాడిన ప్రజా నాయకుడు పండుగ సాయన్న అని, ఆయన పీడిత వర్గాల ఆశాజ్యోతి అని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. మీర్‌పేట్ కార్పొరేషన్ జిల్లెలగూడలోని చందచెరువు కట్టపై ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాయన్న విగ్రహాన్ని ఆదివారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొండా, సబిత మాట్లాడుతూ అన్యాయాన్ని ధైర్యంగా ఎదిరించే తత్వాన్ని పండుగ సాయన్న నుంచి నేర్చుకోవాలని, ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మక్తల్ ఎమ్మెల్యే వి.శ్రీహరి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెల శ్రీరాములుయాదవ్, కొలన్ శంకర్‌రెడ్డి, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్, నీలం మధు ముదిరాజ్, సాయన్న విగ్రహదాతలు యెడ్ల మల్లేశ్‌ముదిరాజ్, రాఘవేందర్‌ముదిరాజ్, మీర్‌పేట్, బడంగ్‌పేట్ మేయర్లు దుర్గాదీప్‌లాల్, చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మద్ది రాజశేఖర్‌రెడ్డి, ముదిరాజ్ సంఘం ప్రతినిధులు శివశంకర్‌ముదిరాజ్, దయానంద్‌ముదిరాజ్, పలువురు కార్పొరేటర్లు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



పండుగ సాయన్న విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే సబితారెడ్డి తదితరులు

విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలు రాజకీయాల్లోనూ రాణించాలి

- ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

మన్సూరాబాద్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ కులస్థులు సంఘటితంగా ఉంటూ అన్ని రంగాలతో పాటు రాజకీయ రంగాల్లోనూ రాణించాలని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి సూచించారు. ఎల్బీనగర్ నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవం ఆదివారం చింతల్‌కుంటలోని పల్లవి గార్డెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ మధుసూదనాచారి, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మదన్మోహన్ చారి, గౌరవాధ్యక్షులు లాలుకోట వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి సొల్లేటి కృష్ణమాచారిలు విచ్చేశారు. సంఘం ఎల్బీనగర్ నియోజకవర్గ అధ్యక్షుడిగా అందోజు శ్రీనివాసాచారి, గౌరవాధ్యక్షుడిగా నాగోజు రామాచారి, ప్రధాన కార్యదర్శిగా కొండోజు వేణుగోపాలాచారి, కార్యనిర్వాహణాధికారిగా పడకంటి వెంకటాచారి, కోశాధికారిగా బొల్లోజు నర్సింహాచారి, ప్రచార కార్యదర్శిగా దార్ల జంగయ్యచారి, రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా వెలకుర్తి చంద్రశేఖరచారిలు ప్రమాణస్వీకారం చేశారు. కాగా నూతన కమిటీ సభ్యులకు సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పులిగిల్ల శ్రీనివాసాచారి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భగా నియోజకవర్గ నూతన అధ్యక్షుడు అందోజు శ్రీనివాసాచారి మాట్లాడుతూ సంఘం పెద్దలు తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా చేపట్టి విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ జాతి సంక్షేమానికి పాటుపడతానన్నారు. అనంతరం ఎల్బీనగర్ నియోజకవర్గ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను సంఘం పెద్దలతో కలిసి ఎమ్మెల్సీ ఆవిష్కరించారు.



ప్రమాణస్వీకారోత్సవంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి

భారతీయ భాషలకు మాతృభాష సంస్కృతం : మాధవిదేవి

చాదర్‌ఘాట్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): సులభమైన భాష సంస్కృత భాష భారత రాజ్యాంగం చేత గుర్తించబడిన భాషలలో ఒకటని హైకోర్టు జడ్జి జస్టిస్ టి.మాధవిదేవి అన్నారు. మూసారాంబాగ్‌లోని అరోరా పీజీ కళాశాలలో జరిగిన 5వ ప్రాంతీయ సంస్కృత సమ్మేళనం ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మన భారతీయ భాషలకు మాతృభాష సంస్కృతమని వివరించారు. తాను సంస్కృత శాస్త్రములలోని లేటరీ తయారీ ఎలా అన్నది సూత్రం ద్వారా చేసిన విషయాన్ని విన్నాను. కానీ ఎంత మంది సంస్కృతం అర్థం చేసుకోగలరు. మనం సంస్కృతం తెలుసుకున్నట్లైతే ఆ భాషలో నిక్షిప్తమైన ఎన్నో వైజ్ఞానిక విషయాలను తెలుసుకోగలుగుతామన్నారు. ద్విశతసహస్రావదాని డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ మాట్లాడుతూ భారతీయులు భారతీయ భాషలను మాట్లాడడం, భారతీయ వస్తువులను కొనుగోలు వంటివి అలవాటు చేసుకోవాలని సూచించారు. సామాజిక ప్రముఖులు ఎక్క చంద్రశేఖర్ మాట్లాడుతూ భారతీయతకు మూలమైన సంస్కృత భాషను కాపాడుకోవాలన్నారు. అణుబాంబు కంటే బలమైన ఆయుధం సంస్కృత భాష అని అఖిలభారత బాలకేంద్ర ప్రముఖులు ఉపద్రష్ట వెంకటరమణ అన్నారు.



మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి జస్టిస్ మాధవిదేవి

గ్రామాల అభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలి

- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్‌లో నిర్వహించిన ఏపీఎల్-10 క్రికెట్ టోర్నీ విజేత జట్లకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి హాజరై విజేత జట్లకు షీల్డ్‌తో పాటు నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలపై దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు డ్రగ్స్, సైబర్ నేరాలకు దూరంగా ఉండాలన్నారు. టోర్నీలో విన్నర్‌గా టీఎన్‌టీ, రన్నర్‌గా ఓం సాయిరాం జట్లు నిలిచాయి. కార్యక్రమంలో విష్ణుగౌడ్, బాలకృష్ణగౌడ్, మహేందర్, చంద్రబాబు, భాను, మురళీ, సమ్మయ్య, వెంకట్‌రెడ్డి, సురేష్, మహేందర్, కరుణాకర్‌రెడ్డి, వంశీ, నవీన్, శంకర్, వినోద్, మహేష్, హరికృష్ణ, సురేష్, సోనూ, సన్నీ, నరేష్ పాల్గొన్నారు.



విజేత జట్టుకు షీల్డ్‌ను అందజేస్తున్న చైర్మన్ మధుసూదన్‌రెడ్డి తదితరులు

బ్యాడ్మింటన్ విజేతలకు బహుమతుల ప్రదానం

చాదర్‌ఘాట్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్ షటిల్ ప్లేయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూసారాంబాగ్ ఎస్‌బీహెచ్ కాలనీలోని జీహెచ్‌ఎంసీ ప్లే గ్రౌండ్‌లో మూడు రోజుల పాటు జరిగిన 20వ ఇన్విటేషనల్ రిపబ్లిక్ డే బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. 19ప్లస్‌లో జయంత్/రాహుల్ జట్టు, 35ప్లస్‌లో అప్పారావు/సురేష్ జట్టు, 50ప్లస్‌లో బి.సంతోష్/డాక్టర్ కృష్ణమోహన్ జట్టు ఫైనల్స్‌లో విజేతలుగా నిలిచారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ జాయింట్ సెక్రెటరీ యూవీఎన్ బాబు, కోశాధికారి కె.వంశీధర్, రంగారెడ్డి జిల్లా బాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి కరెడ్ల శ్రీనివాస్‌ల పర్యవేక్షణలో జరిగిన టోర్నమెంట్ ఫైనల్స్ పోటాపోటీగా జరిగాయి. మూడు రోజుల పాటు జరిగిన టోర్నమెంట్‌లో దాదాపు 120 టీమ్‌లు పోటీ పడగా ఆదివారం నాటి ఫైనల్స్‌లో ఎనిమిది జట్లు పోటీ పడ్డాయి. ద్వితీయ స్థానంలో 19 ప్లస్‌లో అమృతపాని/అవినాష్ జట్టు, 35ప్లస్‌లో అశోక్/రాజ్‌కుమార్ జట్టు, 50ప్లస్‌లో బి.గాయత్రీ ప్రసాద్/ఎం.రాజు జట్టు నిలిచాయి. తృతీయ స్థానంలో 19 ప్లస్‌లో శశాంక్/శ్రవణ్ జట్టు, 35ప్లస్‌లో చంద్రశేఖర్/రవికుమార్ జట్టు, 50 ప్లస్‌లో జి.కృష్ణమూర్తి/వై.సురేష్ జట్టు నిలిచాయి. విజేతలకు కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి బహుమతులను ప్రదానం చేశారు. అసోసియేషన్ గౌరవ చైర్మన్ సామ ప్రభాకర్ రెడ్డి, అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులు గంగుల వెంకటేశ్వర్ రెడ్డి, బి.వెంకటేశం, కార్యదర్శులు సింగిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఎ రామకృష్ణ, కోశాధికారి ఎం.స్వామిగౌడ్ పాల్గొన్నారు.



విజేతలకు జ్ఞాపికలను అందజేస్తున్న అసోసియేషన్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కరెడ్ల శ్రీనివాస్, కార్పొరేటర్ భాగ్యలక్ష్మిరెడ్డి

వ్యక్తి అదృశ్యం

హయత్‌నగర్: వ్యక్తి అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల ప్రకారం.. తుర్కయంజాల్ మున్సిపాలిటీ తొర్రూర్ గ్రామంలోని బాలాజీనగర్ కాలనీ ఫేజ్-2లో నివాసం ఉండే బత్తుల మహేష్(30) ప్రైవేటు ఉద్యోగం చేస్తాడు. శనివారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన మహేష్ సాయంత్రం అయినా ఇంటికి రాకపోగా అక్క జ్యోతి మహేష్‌కు ఫోన్‌చేసింది. మహేష్ కొంత సేపటికి వస్తానని చెప్పి ఫోన్ పెట్టేశాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోగా మరోసారి జ్యోతి ఫోన్‌చేసింది. దీంతో ఫోన్ స్విచ్ఛాఫ్ అని వచ్చింది. ఆందోళనకు గురైన జ్యోతి మహేష్ గురించి చుట్టపక్కల బంధువుల వద్ద విచారించినా ఫలితం లేకపోవడంతో ఆదివారం హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కరాటేలో పతకాలు సాధించిన విద్యార్థులు

చంపాపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): గోవాలోని మనోహర్ పారికర్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 18,19 తేదీల్లో నిర్వహించిన అంతర్జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఎల్బీనగర్ నియోజకవర్గానికి చెందిన పలువురు విద్యార్థులు 7బంగారు, 5రజిత, 2కాంస్య పతకాలు సాధించినట్లు భారత అండర్-19 ప్రధాన కోచ్ ఆర్. రాజానాయక్ తెలిపారు. వీరిలో రామావత్ శాన్వినాయక్, 2బంగారు, శ్రీకీర్తి 2బంగారు, డి.భవ్య బంగారు, కాంస్యం, బి.ఆయాన్స్ ప్రిన్స్ 2రజతం, ఆవుల సందీప్‌కుమార్ బంగారు, రజిత, ధనస్వి రజత, కాంస్య పతకాలు సాధించినట్లు, విద్యార్థులు ఆసియా భారతీయ కరాటే సమాఖ్య అధ్యక్షుడు భరత్‌శర్మ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఛాంపియన్‌షిప్ అసిస్టెంట్ కోచ్ సి.కిషోర్, టీమ్ మేనేజర్ మానస పాల్గొన్నారు.



పతకాలు సాధించిన విద్యార్థులతో ఆసియా భారతీయ కరాటే సమాఖ్య అధ్యక్షుడు భరత్‌శర్మ, రాజానాయక్

నిబంధనల మేరకే చర్చి నిర్మాణం చేపట్టాలి

వనస్థలిపురం : ప్రభుత్వ నిబంధనల ప్రకారమే చర్చి నిర్మాణ పనులు చేపట్టాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ బీడీఎల్ కాలనీలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణపు దశలో ఉన్న భవనంలో ఎపఫ్రా మినిస్ట్రీస్ చర్చి పేరుతో డిజే శబ్దాలతో ప్రార్థనలు చేపట్టడం సరైంది కాదని కాలనీవాసులు ఆదివారం సదరు చర్చి వద్దకు వెళ్లి చర్చి వారితో వాగ్వాదానికి దిగారు. సమాచారం అందుకున్న కార్పొరేటర్ సంఘటనా స్థలానికి చేరుకుని వాగ్వాదానికి దిగిన ఇరు వర్గాలను శాంతింపజేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ తమ కాలనీలో ఇంటి నిర్మాణపు అనుమతులు తీసుకుని, నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్‌ను ఏర్పాటు చేయడమే కాకుండా ఎపఫ్రా మినిస్ట్రీస్ చర్చి పేరుతో కాలనీలో ఘర్షణ వాతావరణాన్ని సృష్టిస్తున్నారన్నారు. ఈ నిర్మాణంపై పలుమార్లు సంబంధిత జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోకుండా సదరు చర్చి నిర్వాహకులకే వత్తాసు పలుకుతున్నారని కార్పొరేటర్‌కు వివరించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీల్లో నూతనంగా నిర్మాణాలు చేపట్టే ప్రతి ఒక్కరూ తప్పని సరిగా ప్రభుత్వ నిబంధనల ప్రకారమే తమ నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. కాలనీ అధ్యక్షులు మాధవరెడ్డి, కోట సాయి, రవీందర్‌రెడ్డి, వీఏ బాబు, శంకర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, జనార్దన్‌రెడ్డి, బాల సుద్దులు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



కాలనీవాసులను అడిగి వివరాలు తెలుసుకుంటున్న కార్పొరేటర్



ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆదివారం అబిడ్స్‌లో నిర్వహించిన లోక్‌మంతన్2024 సక్సెస్ మీట్‌లో బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డిని సన్మానించి జ్ఞాపికను అందజేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

- సైదాబాద్, ఆంధ్రజ్యోతి

హనుమాన్ ఆలయంలో అచ్చంపేట ఎమ్మెల్యే పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

చంపాపేట, జనవరి 19(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలోని ధ్యానాంజనేయస్వామి సన్నిధిలో ఆదివారం అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు ఎమ్మెల్యేకు వేద ఆశీర్వచనాలు అందించి స్వామి వారి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ మాజీ ధర్మకర్త బిల్లకంటి కిరణ్‌కుమార్‌గుప్తా, భక్తుడు జూలరి సురేష్‌గుప్తా పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు ఆర్థిక సాయం

సరూర్‌నగర్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): అద్దె ఇంట్లో జీవనం సాగిస్తున్న ఓ పేద మహిళ ఉన్నట్టుండి అనారోగ్యం బారిన పడింది. దాంతో ఆమె వైద్యం కోసం, కుటుంబ అవసరాల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. విషయం తెలుసుకున్న స్థానికులు ఆమెకు అండగా నిలిచి తోచినంత సాయం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్ అల్మాస్‌గూడలోని శ్రీశ్రీహోమ్స్ కాలనీలో రాధమ్మ అనే మహిళ 12 సంవత్సరాలుగా అద్దె ఇంట్లో జీవనం సాగిస్తోంది. కాగా ఇటీవల ఆమె అనారోగ్యంబారిన పడడంతో ఆర్థిక సమస్యలు చుట్టుముట్టాయి. విషయం తెలుసుకున్న శ్రీశ్రీహోమ్స్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రంజిత్‌గౌడ్ వెంటనే స్పందించి కాలనీలో విరాళాల రూపంలో రూ.53వేలు సేకరించారు. ఆదివారం రాధమ్మ నివాసానికి వెళ్లి ఆమెకు సదరు నగదును అందజేశారు. భవిష్యత్‌లోనూ ఆమెకు అండగా ఉంటామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి లక్ష్మీనర్సింహారెడ్డి, కోశాధికారి వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మన్సూరాబాద్ అధ్యక్షుడిగా హరీష్‌రెడ్డి



హరీష్‌రెడ్డి

మన్సూరాబాద్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): బీజేపీ మన్సూరాబాద్ డివిజన్ నూతన అధ్యక్షుడిగా మునగాల హరీష్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఇటీవల ఎల్బీనగర్‌లోని రంగారెడ్డి అర్బన్ జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి ఎన్నికైన కౌన్సిల్ సభ్యులు, డివిజన్ అధ్యక్షులను ప్రకటించారు. ఈ సందర్భంగా మునగాల హరీష్‌రెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లో పార్టీని మరింతగా పటిష్టపరిచేందుకు కృషి చేస్తానని, తన నియామకానికి సహకరించిన స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, జిల్లా పార్టీ పెద్దలు, డివిజన్ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాదాలు సంభవిస్తే తప్ప స్పందించరా?

- విద్యుత్ శాఖాధికారులపై కార్పొరేటర్ కొప్పుల ఆగ్రహం



చేతికి అందేలా వేలాడుతున్న విద్యుత్ వైర్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని బాలాజీనగర్ పరిధి సహారా రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లతో అటుగా రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రమాదాలు సంభవిస్తే తప్ప విద్యుత్ శాఖాధికారుల్లో చలనం కలగదా అని మన్సూరాబాద్ కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆ శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలాజీనగర్ కాలనీవాసులతో కలిసి ఆదివారం విద్యుత్ వైర్లను ఆయన పరిశీలించి అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొప్పుల నర్సింహా రెడ్డి మాట్లాడుతూ ఎంతఈరెడ్డి ఫంక్షన్ హాల్ వద్ద నిర్మిస్తున్న హైరైజ్ అపార్టుమెంటు వద్ద గల విద్యుత్ స్తంభాన్ని తొలగించి రోడ్డుకు సమీపంలో డ్రైనేజీ లైన్లపైనే వాహనదారులు ఇబ్బందులు పడేలా వేశారన్నారు. విద్యుత్ శాఖాధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై సమస్యలు లేని చోట్ల పనులు చేపడుతూ అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బాలాజీనగర్ కాలనీ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, శ్రీశైలం, కృష్ణగౌడ్, యాదగిరిగౌడ్, జనార్దన్‌రెడ్డి, డాక్టర్ దశరథ, శంకర్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, ఉమా, సువర్ణ, యశోద, రామేశ్వరీ పాల్గొన్నారు.

రేపటి నుంచి 24 వరకు గ్రామసభలు

అబ్దుల్లాపూర్‌మెట్ : రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల లబ్ధిదారుల ఎంపికలో భాగంగా ఈనెల 21నుంచి 24వ తేదీ వరకు అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని గ్రామాల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి శ్రీవాణి తెలిపారు. మండలంలోని 14 గ్రామాల్లో సభలు నిర్వహించనున్నట్లు ప్రతి గ్రామానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించినట్లు ఆమె తెలిపారు. ఆయా తేదీల్లో గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద సభలు ఉంటాయని ఉదయం 10గంటలకు గ్రామసభ ప్రారంభమవుతుందన్నారు.

గ్రామ సభల వివరాలు

ఈ 21న అబ్దుల్లాపూర్‌మెట్, లష్కర్‌గూడ, బలిజగూడ, పిగ్లీపూర్, గండిచెరువు, 22న కవాడిపల్లి, అనాజ్‌పూర్, బండరావిరాల, జాఫర్‌గూడ, గుంతపల్లి, 23న మజీద్‌పూర్, బాటసింగారం, చిన్నరావిరాల, ఇనాంగూడ గ్రామాల్లో గ్రామ సభలు జరుగనున్నాయి. పథకాలకు అర్హులైన వారందరు గ్రామసభలో పాల్గొనాలని ఆమె కోరారు.

మున్సిపాలిటీలో 21, 22 తేదీల్లో వార్డు సభలు

హయత్‌నగర్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఈనెల 21,22 తేదీల్లో తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో వార్డు సభలు నిర్వహించనున్నట్లు కమిషనర్ అమరేందర్‌రెడ్డి తెలిపారు. ఈ సభల్లో రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులను పరిశీలించనున్నట్లు తెలిపారు. 21న రాగన్నగూడ, మునగనూర్, కోహెడ, తొర్రూర్, బ్రాహ్మణపల్లిలోని వార్డు కార్యాలయంలో, 22న తుర్కయంజాల్, కమ్మగూడ, ఇంజాపూర్, ఉమర్‌ఖాన్‌దాయ రా వార్డు కార్యాలయంలో సభలు జరుగుతాయన్నారు. కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎవరైన సభలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.